## 3. తృతీయం

"**ఆరు** మైళ్ళు నాటుతోవన స్కూటర్ మీద తీసుకొచ్చి పాలెం చేర్చారు సూర్యంగారు. ఇక ఇక్కణ్నించి ఒక బస్సులో తుని వెళ్ళి అక్కణ్నుంచి మరో బస్సులో విశాఖపట్నం వెళ్ళాలి. మధ్యాహ్నం మూడు గంటల్లోగా డ్యూటీకి రిపోర్టు కాకపోతే పీకలమీది కొస్తుంది. టైం పదకొండవుతోంది. "స్కూటర్ చేతిలో వుంది గదాని తాత్సారం చేసేసేరు. ఈపాటికి తున్లో ఉంటే మెయిల్ అందేది. హాయిగా రెండు గంటలయ్యేసరికి ఇంటికీ, మూడింటికి డ్యూటీకి వెళ్ళేవాడిని" అని విసుక్కున్నాను. సూర్యంగారు నా వేపు చూడ్డంలేదు. "ఏరా సూరయ్యా ఇక్కడున్నావు?" అని ఎవణ్నో పలకరిస్తున్నారు. ఎడ్లబండి తోలుకుంటూ పాలెం నుంచి తిరిగిపోతున్నాడు వాడు.

"చిత్తంబాబు. పెద్దయ్యగోర్ని దిగబెట్టొత్తన్నానండి."

"ఏమిటి? కొండబాబు గార్నే?"

"చిత్తంబాబు."

"పాలెంలో ఉన్నారా?"

"మరేనండి, మున్సిబుగారింట కబుర్లాడుతన్రు."

"చెప్పవేం!?" అని స్కూటర్ స్టార్టుచేశారు సూర్యంగారు. "ఎక్కండి."

"ఎందుకు?"

"చెప్తాగా! మీకు మెయిల్ దాటిపోయిందని బెంగక్కర్లేదు. కార్లో పంపిస్తాను విశాఖపట్నం."

మునసబు గారింట్లోంచి మల్లు పంచె, కళ్ళీ లాల్చీ, కండువా ధరించిన ఒక పెద్దాయన అప్పుడే బయటికొస్తున్నారు. రోడ్డు మీద కారుంది.

"వైజాగేనా, కొండబాబుగారూ?"

"వైజాగే యెళ్ళాలనుకోండి-" అని నసిగాడాయన. "ఏం? వస్తారా?"

"నేను కాదు. మా ఫ్రెండు. వైజాగ్‌లో దింపేద్దురూ."

"నేను డైరెక్టుగా యెళ్ళనండి. తున్లో లేటవుద్ది."

"మీ మిసెస్ కెలా వుంది?"

"బాగలేదట, ఉదయమే కబురొచ్చింది, రమ్మని."

"మరి ఆ లెక్కని తున్లో ఆలస్యమెందుకు? త్వరగా వెళ్ళండి...."

కొండబాబుగారు నవ్వాడు. "మనం తొరగా యెళ్తే ఒచ్చే ఆపద ఆగిపోద్దేటండి! రాతెలాగుంటే అలా జరుగుద్ది. పైగా అక్కడ అబ్బాయున్నాడుగా."

"పోనీ తునిలో దింపెయ్యండి మా ఫ్రెండుని. మెయిల్ ఏమైనా లేటయితే పట్టుకుంటాడు. మీరు బయల్దేరేలోగా బస్సు దొరికితే యెక్కిపోతాడు. ఇంకా తప్పితే వైజాగ్‌లో దింపెయ్యండి మీతో తీసుకెళ్ళి."

"ఎక్కమనండి."

సూర్యంగారు దయతలచి పక్కకి తీసికెళ్ళి చెప్పాడు. లేకపోతే కొండబాబుగారి ధోరణికి కొత్తతో, అసహ్యంతో ఇబ్బంది పడిపోదును -

కొండబాబుగారు రైల్వే కాంట్రాక్టరు. అరవై ఏళ్ళుంటాయి. మూడో పెళ్ళాం విశాఖపట్నం ఆస్పత్రిలో ఉంది. లక్షల మీద ఆస్తి. కొడుకు రత్నరాజని - విశాపట్నంలో హార్బరు కాంట్రాక్టులు చేస్తున్నాడు. రత్నరాజ్ చారిటీస్ పేరిట పేదలకి తోడ్పడుతున్నది ఆయనే.

ముందు సీటులో యెక్కాను. సూర్యంగారికి వీడ్కోలు చెప్పి, కారు కదిలింది.

"వైజాగ్‌లో ఏం పనండి?"

వెనక్కి తిరిగి చూశాను. పేపరు అడ్డం ఉంది. కొండబాబుగారికి నాకూ మధ్య. మాట్లాడుతున్నది నాతోనేనని గ్రహించాను.

"జాబ్ చేస్తున్నానండి...."

"అదే... ఎందులోనని అడుగుతున్నాను."

చెప్పాను.

"మూంచి ఎండప్పుడు బయలెల్లేరు.."

ఏదో అయిష్టత కనబడుతోంది నేనతనితో ప్రయాణం చెయ్యడంలో అతనికి. కాని తప్పదు. ఎలాగో భరించి ఎంతవరకు వీలయితే అంతవరకు అతన్తో వెళ్ళాలి. ఆయన మాటలో ప్రశ్నలేదు. అంచేత మాట్లాడలేదు నేను.

"కారు వైజాగ్ దాకా యెళ్ళదండి."

"పోన్లెండి. మీరెక్కడ దింపేస్తే అక్కడ దిగిపోతాను. అక్కణ్నించి ఎలాగోలా వెళతాను!" అన్నాను వీలైనంత వినయంగా.

"అలాగెందుకు దిగిపోవాలి? నేను తున్లో ఆగుతాను. అక్కడ దిగిపోదురు గాని" పేపరు చాటునుంచి పొడినవ్వు వినిపించింది.

"సూర్యంగారికీ మీకూ ఏటి పరిచయం?" - "ఎప్పుడొచ్చేరు?" - "ఎందుకు?" - "అంత టయం ప్రకారం యెళ్ళిపోవాల్సిన వార్ని పొద్దుట పూట స్కూటర్ మీద తునిదాకా

దిగబెట్టరాదా?" - "మీకు జీతమెంత?" "పిల్లలెందరు? - "స్వంత యిల్లా అద్దె ఇల్లా?"

ఆరుమైళ్ళు వెళ్ళాలి ఈయనతో.

బ్రాంచిరోడ్డు ట్రంకురోడ్డుని కలిపే దగ్గిర కొండబాబుగారు ఏదో అస్పష్టంగా గొణిగాడు. కారాగింది.

"ఆ వొచ్చేలారీ ఆపు."

డ్రయివర్ దిగాడు లారీకడ్డంగా చెయ్యి పెట్టాడు, ఆగలేదు.

"ఆ యెనకాల్లారీ గూడా చూడు."

"ఇంక రెండుమైళ్ళే గదండీ ఉంది తుని!" అన్నాను.

"పావలా పారేస్తే తీసుకుపోతాడు లారీవోడు."

"అదికాదు నేనన్నది. మీరెలాగా తునిదాకా వస్తారుగా."

"నేనూ లారీలోనే వస్తానయ్యా రంకు మగడా! నిన్నిక్కడొదిలేసి నేను కార్లో యెళిపోతాననుకున్నావా?"

నిర్ఘాంతపోయాను ఆయన ధోరణికి. అయితే నా భావం ఆయనకి కనబడదు. పేపరు అడ్డం ఉంది.

డ్రయివరు కొద్దిగా కదిలి నాకు కనడేటట్టు, ఆయనకి కనబడనట్టు వొచ్చాడు. 'దిగు' అన్నట్టు సంజ్ఞ చేసేడు. దిగేను.

ఇద్దరం వున్నాం లారీ ఆపడానికి. మామాటలు కొండబాబుగారికి వినపడనంత దూరం వెళ్లాం.

రెండో లారీ మరో నిమిషం పోయాక వచ్చింది స్లో చేశాడు. "తుని" అన్నాడు డ్రయివరు. లారీ డ్రయివర్ "ఖాళీ లేదు" అంటూ తొక్కేశాడు.

"ఈ పాటికి తుని చేరేవాళ్ళం?" అన్నాడు కొండబాబుగారి డ్రయివర్.

"ఆయన లారీ ఎక్కుతాననంటారేమిటి?" అన్నాను.

"రోజా యింతేనండి. ఈ జంక్షన్ దగ్గిర, కారు ప్రయాణం - ఇక్కణ్నించి పాలేనికి. పాలెంనించి ఇక్కడికేనండి -" అని; గొంతు కొంచెం తగ్గించి "లేకపోతే తున్లో ఎవరో తగిలి కారు అడుగుతారు గదండి" అన్నాడు డ్రయివర్.

మొత్తం అయిదు లారీలు వెళ్ళిపోయాయి.

కారు హారన్ మోగింది డ్రయివర్ పరుగెత్తాడు. వెనకసీటు దగ్గిర వొంగాడు. కొండబాబుగారు ఏదో చెప్పాడు. కార్లోనే తునివరకు వెళదాం అని నిర్ణయం తీసుకొన్నారేమో. నన్ను రమ్మంటారేమో అని చూశాను. కాదు-కార్లో వాళ్ళిద్దరూ వెళ్ళిపోతారేమో అనుకొన్నాను. కానేకాదు.

మైలు దూరంలో బస్సు.

మళ్ళీ రెండు నిముషాలు - బస్సు ఆపడానికి ఇద్దరు-

ఆర్.టి.సి. స్టేజి కాదు. పైగా వేళ్ళాడుతున్నారు-ఆగలేదు బస్సు.

మళ్ళీ కారు హారన్.

"తుని పోదాం పద."

"ఎస్సార్."

"ఎక్కవయ్యా.... ఏంటి నీ పేరూ!"

తునిలో రైల్వే ఐ.ఓ.డబ్ల్యు. ఆఫీసుకి కొంచెం దూరంలో ఆపాలి. అక్కడ ఆయన దిగిపోతారు. కారు నారాయణరాజుగారింటి దగ్గర ఉంచాలి. ఆయన వైజాగ్ వెళ్ళి రాత్రి తొమ్మిదిలోగా వచ్చేస్తారు. బస్‌స్టాండ్‌కి డ్రయివర్ రావాలి. ఆయన వస్తే అప్పుడు వెళ్ళి కారు తేవాలి. విస్పష్టంగా చెప్పారు కొండబాబుగారు.

కారు ఆగిన చోటినుంచి బస్సులు ఆగేచోటు ఫర్లాంగుంది. కొండబాబుగారి దగ్గిర సెలవు పుచ్చుకొని డ్రయివర్‌కి థాంక్స్ చెప్పి నడిచాను. ఇందాక మేం ఆపితే ఆగని బస్సు అక్కడుంది. ఐతే ఖాళీ లేదు. "ఐదు నిమిషాల్లో ఎక్స్‌ప్రెస్ బస్ వుందన్నా"డు కండక్టరు. ఈ బస్సును నక్కపల్లి జంక్షన్ దాటే లోగా తొక్కేస్తుందిట. "అందులో ఖాళీ లేకపోతేనో?" అన్నాను. "ఐతే రండి. ఇందులో అనకాపల్లిదాకా నుంచోవాలి."

కొండబాబుగారు నడిచి వచ్చేరు. ఆయనతోబాటే చేరింది ఎక్స్‌ప్రెస్ బస్సు. జనం దిగుతున్నారు. నేను బస్ తలుపు దగ్గిర చేరాను-ఎక్కటానికి ఫస్టు, "ఆళ్ళంతా కాఫీలకి దిగుతున్నారు-" అంటున్నారు కొండబాబుగారు. "ఒకటే ఖాళీ" అన్నాడు కండక్టరు నా ప్రశ్నకి బదులుగా. "ఖాళీ ఉందిట, ఎక్కండి" అన్నాను కొండబాబుగారితో. ఆయన భార్య హాస్పిటల్లో ఉండడాన్ని తలుచుకుని. "ఎంత ఛార్జీ వైజాగ్ కిందులో?" కండక్టరు చెప్పాడు. "అందులో నాలుగు రూపాయలేగా" అంటూ ముందు బస్సు ఎక్కాడాయన ఎక్కడమేమిటి, బస్సు కదిలింది.

సీట్లో సెటిలయ్యాను టైం-పదకొండుంపావు. "టైముందా?" అన్నాను.

"వెళిపోదాం. ఫైవ్ మినిట్స్, దిగబాకండి" కండక్టరు జవాబు.

పాయకరావుపేట దాటి రెండు మైళ్ళు వచ్చాం. ముందు బస్సు ఆగి ఉంది. కండక్టరూ డ్రైవరూ ఈ బస్సును ఆపారు.

"బ్రేక్ డౌన్."

"ఇందులో ఖాళీ లేదు."

"కొందర్ని తీసుకుపోండి."

"సరే రమ్మను. ఎగ్‌స్ట్రా అవుద్ది."

"ఇచ్చేవోళ్ళే వస్తారు."

"త్వరగా రమ్మను. ఇప్పటికే పది నిమిషాలు లేటు!"

"ఎగ్‌స్ట్రా కట్టేవారు, అడ్డరోడ్డు ఎలమంచిలి, అనకాపల్లి, వైజాగ్ పాసింజర్లు దిగాల!" అవతలి బస్సు కండక్టరు బిగ్గరగా కేకేశాడు. "సీట్లులెవ్వు నిలబడాలి!..... చిన్న చిన్న స్టేజీలవారు ఈ బస్సు ఎక్కబోకండి!"

అంత నిరుత్సాహమైన నిబంధనలకి లోబడి పన్నెండుమంది వొచ్చారు. ఒక పచ్చి బాలింతరాలు బిడ్డతో ఎక్కింది. ఆమె తల్లి కాబోలు, లేకపోతే అత్తగారో - ముసలావిడ- ఎక్కింది- నేనూ నా పక్కనున్నాయనా మొహమొహాలు చూసుకున్నాం. మరుక్షణం నిలబడిపోయాం. వాళ్ళకా సీటు వదలి.

కొండబాబుగారు చివరి క్షణంలో ఎక్కారు...... "మొత్తానికి రూపాయి పావలా కాజేశావు గదయ్యా" అన్నారు కండక్టరుతో. "భలేవారే. ఇదంతా నేనే మూటగట్టుకు పోతానంటారా?" అని నవ్వాడు కండక్టరు.

బ్రీఫ్‌కేసు ఎక్కడ పెట్టాలా అని బస్సంతా చూశారు కొండబాబుగారు.

అరలు ఖాళీ లేవు. నేనే అందుకొని పట్టుకున్నాను-నా పక్కకొచ్చి నుంచున్నాడాయన.

ఎలమంచిలిలో కూడా ఎవ్వరూ దిగలేదు. ఎవర్నీ ఎక్కనివ్వలేదు కండక్టరు.

తాళ్ళపాలెం దాటాక వచ్చిన లెవెల్ క్రాసింగు దగ్గర బస్సాగింది. మద్రాసు వెళ్ళే మెయిల్ కోసం - గేటు.

అయిదారుమంది దిగారు. అందులో ఒక దగ్గిర కూర్చోమని సంజ్ఞ చేశాను కొండబాబుగారికి. "ఆళ్ళు మళ్ళీ వస్తారు."

"ఒస్తే రానివ్వండి. మీరు పెద్దవారు. సర్దుకోమని రిక్వెస్టు చేద్దాం."

ఆయన మొహం తిప్పేశాడు. మెయిల్‌ని గమనించేవాడిలాగా.

అందరూ బిలబిలమంటూ దూరేశారు.

అనకాపల్లిలో ముందున్న లేడీస్ సీటు ఖాళీ అయింది. కాని ముగ్గురు ఆడవాళ్ళు చకచకా ఎక్కి సర్దుకున్నారక్కడ.

అగనంపూడి దాటాక నామీద ఏదో బరువు వాల్తున్నట్టు స్ఫురించి దృష్టిని కిటికీలోంచి బస్సులోకి తిప్పాను. కొండబాబుగారు స్ట్రాప్ వదిలేసి కూలబడిపోయారు.

"ఆపాలి, ఆపాలి" అరిచాను.

"అయ్యో ముసలాయన!" - "నీళ్ళు జల్లండి" - "పల్స్ చెక్ చెయ్యండి" - "ఆయన

తాలూకెవరూ లేరా?" - సీటు ఖాళీ చెయ్యండయ్యా బాబూ. ఏం మనుషులు!" - "ఏం ప్రమాదం లేదు. హి ఈజ్ ఆల్‌రైట్. కొంచెం నీర్సం అంతే-"

ఆయన్ని కూర్చోపెట్టారు. మళ్ళీ ఏమీ అవకుండా ఆయన్ని చూస్తుండే బాధ్యత తీసుకోడానికి గాను నాక్కూడా సీటు.

గాజువాక దాటేక కళ్లు తెరిచాడు. "కొండబాబుగారూ! ఎలా వుంది?"

ఆయన రెప్ప లల్లార్చాడు. అంతే. మళ్ళా నామీద వాలిపోయాడు.

కుడిచెయ్యి పైకెత్తి వాసన చూశాను. ఈ పూట భోంచేసినట్టు లేదు.

చావులమదుం జంక్షన్ దగ్గిర పదిహేనుమంది దాకా దిగిపోయారు. కొండబాబుగార్ని మూడు ప్లేసుల సీటులో పడుకోబెట్టి నేనూ దిగాను. కంపెనీ బస్సు కలిసే టైం. "అదుగో!" .... పరుగెత్తాను. బస్సాపి, కనబడ్డ సహోధ్యాయుల్లో నా వేపు చూసినవాడికి చెప్పాను. "మా అంకుల్ ఒకరు ఆ బస్సులో ఫెయింటయియ్యారు. ఆయన్ని హాస్పిటల్‌కి తీసికెళ్ళాలి. ఎస్.ఇ.తో చెప్పండి. ఇంటికి ఫోన్‌చేస్తే తరవాత షిప్టుకి రాగలను-అక్కర్లేపోతే లీవ్ గ్రాంట్ చెయ్యమనండి."

"ఓకే ఓకే - కేరీ ఆన్;"

అక్కడే ఆటో దొరికింది. కండక్టర్ సాయం చేశాడు.

కాజువాల్టీ ఓ.పీ.లో ఉమాపతి వున్నాడు-వెంటనే చూశాడు.

"నథింగ్ టు వర్రీ."

"అసలేమైంది?" అన్నాను. హార్ట్ ఎటాకేమోనని అనుమానం తగిలి.

"అది నువ్వు చెప్పాలి!" అన్నాడు ఉమాపతి. లెంపకాయ కొట్టినట్టు.

చెప్పవలసినంత చెప్పాను. కొండబాబుగార్ని బెడ్‌మీద సెటిల్ చేశారు. "నేను బయటికెళ్ళి వీళ్ళబ్బాయికి ఫోన్ చేస్తాను" అన్నాను.

అప్పుడే వొచ్చాడు డాక్టర్ నరసింహారావు. "ఇదేటి? కొండబాబుగారే! ఏటైంది రా యీనికి?"

"ఫెయింటయ్యారండి" అన్నాను.

వెంటనే ఫోన్ తీసి హాస్పిటల్లోనే ఒక నెంబరు చెప్పాడు. "ఆఁ చూడూ, మేరీయా? నేను డాక్టరు నరసింహారావుని. కాజువాల్టీ నుంచి మాట్లాడుతున్నాను. అక్కడ సీతాయమ్మగారని పేషంటు-స్పెషల్‌రూం. ఆరో నెంబరు. అక్కడ పోర్టు కంట్రాక్టరు రత్నరాజుగారుంటారు. అర్జంటుగా యిక్కడికి పంపించు. సాలో?"

బతికించారు.

"మీరు తీసుకొచ్చేరా?'

"ఔనండి. బస్సులో వొచ్చాం. తున్నించి"

"కారేమైంది?.... తున్లో వదిలేశారా?" నవ్వాడు. "ఆవిణ్ని చూడ్డానికి బయల్దేరి వుంటాడు..... వారంనాడు కబురు చేశాం.!"

"ఆవిడకెలా వుంది?"

"రికవర్ అయిపోయింది..... లక్కీ వుమన్" ఉమాపతి వేపు తిరిగి నవ్వాడు.

"అదృష్టం ఆవిడిదికాదు....." ఉమాపతి వెకిలిగా నవ్వాడు. "ప్రొఫెసర్ నారాయణమూర్తిది" అంటూ, ముసలాడు వింటున్నాడా అన్నట్టు అనుమానంగా చూశాడు. లేదని రూఢీ చేసుకున్నట్టున్నాడు - "రెండుసార్లు ఫారిన్ పంపింది....."

"చిన్నప్పుడు, గురువుగారాయె. మరి!" నరసింహారావు నవ్వాడు.

"చిన్నప్పుడా యిప్పుడా?" ఉమాపతి నవ్వు వెకిలిగా వుంది. "అయినా ఆవిడ ఏమంత పెద్దదైపోయిందని! గట్టిగా ముప్పయ్యేళ్లుండవు!"

నేను గొంతు సవరించుకున్నాను. "నేనెళ్లొచ్చాండి?" అన్నాను.

"వెళ్ళండి. రత్నరాజుగారొస్తారుగా ఫర్లేదు!"

నాలుగు రోజుల తర్వాత పేపర్లో 'ప్రముఖ కాంట్రాక్టర్ కొండబాబు హృద్రోగంతో మృతి' - అన్న ఐటమ్ పేపర్లో చదివాను. "దానము భోగము నెరుగని దీనుని ధనమునకు గతి తృతీయమె పొసగున్" అన్న పద్యం గుర్తొచ్చింది -

*("సౌమ్య' మాసపత్రిక ప్రారంభసంచిక-నవంబర్ 1978)*